# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# జలపాతం

" ఏలీ! నీకు నాకూ సరిపడదు, మనిద్దరం ఎవరి దారిన వారు బ్రతకడం ఇద్దరికీ మంచిది, గుడ్ బై! " తలుపు ధడాల్న పెద్ద శబ్దంతో వేసుకుని వెళ్ళిపోయాడు చాంగ్.

"చాంగ్! ఆగు, నేను చెప్పేది విను, మనిద్దరికీ మరికొంత సమయం అవసరం! ప్లీజ్" అంటూనే ఉన్న ఆమె మాటలను పిసరంత కూడా ఖాతరు చెయ్యలేదు. మూసిన తలుపు వెనక మోకాళ్ళమీద కూర్చుండిపోయింది. బాధో, దుఃఖమో తెలియని వేదన ఆమెని చుట్టుముట్టింది.

"చాంగ్" అంటూ ఉలిక్కిపడి మంచమ్మీద లేచి కూర్చుంది, చుట్టూ చూసుకుని 'అది కలే' అనినిర్ధారించుకుంది. చాంగ్ తనని వదిలి వెళ్ళిపోయినప్పటినించీ ఈ కల తనని వెన్నాడుతూనే ఉంది. చేతి టవల్ తో ముఖనికీ, మెడకీ పట్టిన చెమటలు తుడుచుకుంది. మంచం పక్కనే ఉన్న జగ్ లోంచి గ్లాస్ లోకి పోసుకుని గట గటా తాగింది. నెమ్మదిగా నిట్టూరుస్తూ, పక్కనే పెట్టుకున్న మొబైల్ ఫోన్ లో టైము చూసింది. నాలుగున్నర అవుతోంది, ఇంకో గంట టైముంది తను నిద్ర లేచి తయారవడానికి. "మళ్ళీ మరొక టూర్" అనుకుంది బధ్ధకంగా.

న్యూయార్క్ నగరంలోని మాన్ హటన్ ఐలాండ్ లో ఉంది చైనా టవున్. దాదాపు లక్షమందికి పైగా చైనావారు నివసించే ఆ చైనా టవున్ చాలా పెద్దది. వివిధ మాండలీకాల్లో చైనీస్ భాష మాట్లాడేవారు అక్కడ ఎన్నో ఏళ్ళుగా నివసిస్తున్నారు. సువిశాల చైనా దేశంలోని ఒక పల్లెటూరు ఏలీది. ఆమె చైనా టవున్ లోనే ఒక చిన్న స్టూడియో అపార్ట్మెంట్ లో ఉంటూ, యూనివర్సిటీలో చదువుకుంటోంది. పార్ట్ టైము ఉద్యోగంగా యాత్రికులని నయాగరా జలపాతానికి తీసుకుని వెళ్ళే బస్ లో ' టూర్ మేనేజర్' గా పనిచేస్తూ ఉంటుంది.

న్యూయార్క్ నగరానికి దాదాపు నాలుగు వందల యాభై మైళ్ళ దూరంలో ఉన్న ఆ ప్రపంచ ప్రఖ్యాతమైన జలపాతాలు ఎందరో యాత్రికులని విశేషంగా ఆకర్షిస్తూ ఎప్పుడూ డిమాండ్ లో ఉంటాయి. ఏప్రిల్ నెల మూడవ వారం కావడాన చలి అప్పుడే తగ్గుముఖం పడుతోంది, అయినా పూర్తిగా వేసవి వచ్చేవరకూ వాతావరణం ఓ రోజు ఇలా, మరొక రోజు అలా ఉండడం న్యూ యార్క్ నగరానికి అలవాటే. అందుకే అందరికీ ముందు రోజు రాత్రే మెసేజ్ పంపించేసింది.

" ఫలానా టైముకి బస్ చైనా టవున్ లో బయలుదేరుతుంది కనక దానికి కనీసం పది హేను నిమిషాల ముందు అందరూ అక్కడకి రావాలనీ, బస్ ప్రయాణం కనక ఎక్కువగా నీరు తాగవద్దనీ, దానివల్ల రెస్ట్ రూం కి తరచుగా వెళ్ళవలసి వస్తే ప్రయాణం లో ఇబ్బందిగా ఉంటుందనీవాతావరణ సూచన బాగున్నా కూడా ముందు జాగ్రత్త కోసం గొడుగులూ, రెయిన్ కోట్లూ తెచ్చుకోమని."

అమెరికాలో తెలుగు సినిమా షూటింగ్ నిమిత్తం వచ్చిన ప్రముఖ కవీ, రచయిత భరద్వాజ ఆ రోజు ఆ బస్ లోనే నయాగరా వెళుతున్నారు. షూటింగ్ నిన్ననే ముగిసింది, మిగతావారు ఇతర పనుల్లో బిజీగా ఉన్నారు, ఆయనకి తెలిసిన మిత్రుల ఉద్యోగాలనీ, కుటుంబాలనీ ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక తనొక్కడే బయలుదేరాడు. దాదాపు డెబ్బై ఏళ్ళుంటాయేమో అతనికి. నాలుగు దశాబ్దాల రచనా అనుభవం ఆయన జీవితాన్ని, మనుషులనీ నిశితంగా పరిశీలించడానికి కారణమయ్యింది. "కథలెప్పుడూ జీవితాల్లోంచే పుడతాయి, కదిలిస్తే జీవితాలెన్నో కథలు చెప్తాయి" అని అనుభవపూర్వకంగాతెలిసినవాడు. ఆయన తక్కువ మాట్లాడతాడు, తనని కలిసిన వారిని ఎక్కువ మాట్లాడిస్తాడు, ఆ సంభాషణలలోంచి, వారి అనుభవాలలోంచి కథలను సృష్టిస్తాడు. చిన్న కథల రచయతగా ప్రస్థానం ప్రారంభించినప్పటినించీ అదే అలవాటు.

'స్టార్ బక్స్' కాఫీ షాప్ లోంచి ఒక చిన్న 'అమెరికానా' కాఫీ కొనుక్కుని వచ్చి తన సీటులో కూర్చున్నాడు. ఒక్కొక్కరుగా రావడం మొదలు పెట్టారు ప్రయాణీకులు. మౌనం గా అందరినీ చూస్తున్నాడు ఆయన. చాలా మంది చైనీయులు, కొద్దిగా ఆఫ్రికనులు, భారతీయులతో ఆ బస్ నిండసాగింది, ఆస్ట్రేలియా నించి వచ్చినవారు నలుగురు.

సన్నంగా, తెల్లగా బొమ్మలా ఉంది ఏలీ. నవ్వు ముఖం,సూటిగా ఉన్న చిన్న కళ్ళూ, నల్లటి జీన్స్ వేసుకుని పైన పచ్చని రైన్ కోట్, టూరు వాళ్ళిచ్చినది వేసుకుంది. పల్చటి, మెత్తటి జుట్టు వదులుకుంది.

అందరినీ నవ్వుతూ పలకరిస్తూ, వారి ప్రశ్నలకి ఓపికగా సమాధానాలు చెప్తోంది. ప్రయాణీకులందరినీ సౌకర్యం కోసం చిన్న చిన్న గ్రూప్ లు గా విభజించింది. భరద్వాజ దగ్గరకి వచ్చి

" సార్ మీరొక్కరే వెళుతున్నారు కదా! మిమ్మల్ని మరొక ఇండియన్ ఫేమిలీ తో కలిపి ఒక గ్రూప్ గా చేర్చనా? నాకు సౌకర్యంగా ఉంటుంది" అంది.

దానివల్ల తనకొచ్చే నష్టం లేదు, అందుకే " సరే" అన్నాడాయన పుస్తకం చదువుకుంటూ. పది నిమిషాలు ఆలస్యంగా బస్ బయలుదేరింది చైనా టవున్ నించి.

" గుడ్ మార్నింగ్, లేడీస్ అండ్ జెంటిల్ మెన్! ఈ రోజు మీరందరూ మాతో కలిసి ఇలా టూర్ కి రావడం మాకెంతోసంతోషంగా ఉంది. ఇతను మన డ్రైవర్ ఫెంగ్ , మనల్ని జాగ్రత్తగా తీసుకెళ్ళే బాధ్యత ఇతనిది. ఇక్కడనించీ నయాగరా వరకూ మన ప్రయాణం దాదాపు తొమ్మిదిగంటలు పట్టవచ్చు, మధ్యలో మనం కోర్నింగ్ అనే ఊరిలో గ్లాస్ మ్యూజియందగ్గర ఆగుతాము. అది కాకుండా ప్రతీ రెండు మూడు గంటలకీ ఒక సారి రెస్ట్ ఏరియాల దగ్గర ఆపుతాము.బస్ లో ఒక టాయ్ లెట్ ఉంది కానీ, మరీ అత్యవసరమైతే తప్ప ఉపయోగించవద్దని మనవి " అంటూ మొదట ఇంగ్లీష్ లోనూ, ఆ తర్వాత చైనీస్ భాషలోనూ చెప్పింది.

"టూర్ అయిపోయాకా ప్రతీ వారు తనకీ, ఫెంగ్ కి తలకి ఎనిమిది డలర్ల చొప్పున పదహారు డాలర్లు ఇవ్వాల్సి ఉంటుందని" చెప్పింది.

" ఇది ముందు చెప్పలేదే? అయినా టూర్ కంపెనీ వాళ్ళు వీళ్ళకి జీతాలివ్వరా?" అనుకున్నాడు భరద్వాజ.

హాలెండ్ టన్నెల్ లోంచి, న్యూజెరీ వైపుకి వెళుతూ ఉండగా ఆ సొరంగం హడ్సన్ నది క్రిందుగా ఎలా నిర్మించారో చెప్తూ, ఆ సొరంగం మేన్ హాటన్ ద్వీపాన్ని ఎలా న్యూ జెర్సీ భూభాగాన్ని కలుపుతుందో, ట్రాఫిక్ జాములు ఎలా ఉంటాయో చెప్తూ, అందువల్లే ఈ రెండు నగరాలకి మధ్య ప్రయాణించడానికి ప్రజలు రైలుని ఇష్టపడతారని చెప్పింది. న్యూజెర్సీ లో ఒక చోట ఆపి మరికొంతమందిని ఎక్కించుకున్నారు. వారు ఎక్కాకా కూడా, దాదాపు అరగంట సేపు న్యూ యార్క్, న్యూ జెర్సీ నగరాలకి సంబందించిన విశేషాలు చెప్తూనే ఉంది. బస్ న్యూజెర్సీ దాటి వేగం పుంజుకున్నాకా, మరొక రెండు, మూడు గంటల తర్వాత ఎక్కడ ఆపేది చెప్తామనీ, అంతవరకూ, అందరినీ రిలాక్స్ అయి కూర్చోమని మైకులో చెప్పింది.

బస్ పెద్దగా సౌకర్యవంతంగా లేదు, ఈ మధ్య కాలంలో బస్సుల్లో వెళ్ళకపోవడం వల్ల అలవాటు తప్పిన వ్యవహారం,వీటన్నింటికీ తోడు మళ్ళిన వయసు, కూర్చోవడం ఇబ్బందిగానే ఉంది ఆయనకి. నయాగరాని ఎప్పుడూ చూడలేదు కనక ఒకసారి చూసి రావాలన్న కోరికతో బయలుదేరాడు. మరొక రెండు గంటల తర్వాత ఫిలడెల్ఫియా లో ఒక చోట ఆపారు. అక్కడ ఇలా హైవే ప్రయాణీకుల సౌకర్యం కోసం అక్కడ నిర్మించిన రెస్ట్ ఏరియాలో.

మధ్యాహ్నం భోజనాలయ్యాకా చెప్పింది ఏలీ. "ఇంకా వేసవి పూర్తిగా రానందున నయాగరా లో ముఖ్యమైన 'మెయిడ్ ఆఫ్ ది మిస్ట్" టూర్ మే వరకూ ఉండదనీ దాని బదులుగా తాము మరొక మూడు నాలుగు కార్యక్రమాలు అనుకున్నామని, అందులో నాలుగు అంశాలున్నాయని, అన్నీ కలిపి తాము తక్కువ ధరకి పాకేజీ ఏర్పాటు చేస్తామని " చెప్పి, ఇష్టమైనవాళ్ళ దగ్గరనించి డబ్బులు వసూలు చేసింది.

అందులో భాగంగా కోరింగ్ గ్లాస్ మ్యూజియం మొదటగా చూస్తామని చెప్తూ, ఆ మ్యూజియం యొక్క ప్రాముఖ్యతని, ఇతర విశేషాలనీ చెప్పింది. ఆ మ్యూజియం పేరున ఆ టవున్ ని కూడా కోరింగ్ అనే పిలుస్తారు, అక్కడ రకరకాల గ్లాస్ వస్తువులని రూపొందించే ఒక స్టూడియో, గాజు యొక్క లక్షణాలనీ, ప్రత్యేకతలనీ వివరించే మ్యూజియం, తమకిష్టమైన గాజు వస్తువులు కొనుక్కోవడానికి వీలుగా ఒక పెద్ద దుకాణం ఉన్నాయి. అంతే కాక గాజుని ఎలా తయారు చేస్తారో కూడా చూపిస్తారు. చూడటానికి గంట టైము ఇచ్చింది ఏలీ, టిక్కట్లు కొన్నవాళ్ళందరినీ తనతో తీసుకెళ్ళింది.

ఈ పాకేజీలన్నీ "టూరిస్ట్ ట్రాప్" లు గా మిత్రులు ముందే చెప్పి ఉండడం వల్ల భరద్వాజ ముందే తనకిష్టమైన రెండు అంశాలకి మాత్రమే డబ్బు చెల్లించాడు. మ్యూజియం తొందరగా చూసి వచ్చి చెట్టు నీడన ఉన్న బెంచీ మీద కూర్చున్నాడు.

ఇంతలో వచ్చింది ఏలీ " సార్, మీరు చూడడం అయిపోయిందా? తొందరగా వచ్చేశారు! మీరు పొద్దున్నించీ ఏమీ తిన్నట్టుగా కనపడలేదు, ఆర్ యూ ఓకే?" అని అడిగింది.

" యా, ఐ యాం ఓకే. నేను పూర్తి శాకాహారిని, అందుకే ఏమీ తినలేకపోయాను, పదార్థాలు లేవని కాదు, నా మనసుకి నచ్చితేనే కానీ పొట్ట నింపలేను" అని నవ్వాడు.

ఏలీ కూడా నవ్వింది, కానీ అంతలోనే " మీరేమీ తినకపోతే నీరసం వస్తుంది కదా! ఇంకా చాలా దూరం వెళ్ళాలి, అంటూ పరిగెత్తి వెళ్ళి మ్యూజియం లోని కాఫిటేరియాకి వెళ్ళి పళ్ళ ముక్కలున్న ఒక డబ్బా, పెరుగుతో, పళ్ళు కలిపి చేసే స్మూతీ అనే డ్రింక్ తెచ్చి ఇచ్చింది. "ఇవి మీకు నచ్చుతాయి, నచ్చితే ఆరు డాలర్లివ్వండి " అంది తమాషాగా.

ఆయన కూడా నవ్వుతూ, ఆరు డాలర్లు ఆమె చేతిలో పెట్టాడు. మిగిలినవారు అన్నీ చూసి వచ్చేలోపు అవి తిన్నాడు.

" మీరు ఒక్కరే వచ్చారా? ఇండియా నించీ?" అడిగింది ఏలీ.

తను వచ్చిన పని వివరాలు చెప్పాడు. ఏలీ చిన్న కళ్ళు ఆశ్చర్యంతో విప్పారాయి.

" అవునా? నాకు రచయతలంటే ఎంతో ఇష్టం, గౌరవం. నేను చేస్తున్న కోర్స్ కూడా జర్నలిజం, ఇది పూర్తి చేసి న్యూ యార్క్ లో మంచి ఉద్యోగం తెచ్చుకోవాలని నా కోరిక. అందుకే నేను అమెరికా వచ్చాను చాంగ్ తో కలిసి!" సంబరంగా మొదలుపెట్టినా ఆమె ముఖం "చాంగ్ తో కలిసి!" అన్నప్పుడు కళ తప్పడం ఆయన సునిశిత దృష్టిని దాటలేదు.

"అవునా! చాలా సంతోషం, నీలా కష్టపడి చదివుకునే వారంటే నాకు చాలా గౌరవం" అన్నాడు.

" ఇక్కడ స్టూడెంట్స్ అందరూ సాధారణంగా ఇలాగే ఉంటారు, నాలాంటి కొందరు మరింత ఎక్కువ కష్టపడతారు, పడాలి అంతే" అంది ఎటో చూస్తూ.

ఆ తర్వాత మిగతా ప్రయాణీకులని కలిసి అందరినీ మళ్ళీ బస్ లోకి పంపింది. నయాగరా మూడు గంటల్లోకి వచ్చింది అనగా బస్ లో సినిమా చూపెట్టడం మొదలుపెట్టారు. "లార్డ్ ఆఫ్ ద రింగ్స్" సినిమా చూస్తూ, మధ్యలోనే నిద్రపోయాడు ఆయన.

"ఓకే, ఆల్ ఆఫ్ యూ ప్లీజ్ వేక్ అప్" అన్న ఏలీ మాటలకి మళ్ళీ మెలకువ వచ్చింది అతనికి. అప్పటికే నయాగరా జలపాతం యొక్క విశేషాలని చెప్పడం మొదలు పెట్టింది ఏలీ.

" అమెరికా, కెనడా దేశాలని కలుపుతూ ఉన్న పెద్ద జలపాతాన్నే' నయాగరా' అంటారనీ, అందులో మూడు జలపాతాలున్నాయనీ, రెండు అమెరికా వైపునించి బాగా కనిపిస్తాయని, మూడిట్లోకి బాగా పెద్దై అయిన "హార్స్ షూ ఫాల్స్ మాత్రం కెనడా వైపు నించి బాగా కనిపిస్తాయని, మధ్యలో రెండు చిన్న చిన్న ద్వీపాలుంటాయని, అందులోని లూనార్ ఐలాండ్ మీద పౌర్ణమి నాటి రాత్రి గడపడం చాలా రొమాంటిక్ గా ఉంటుందనీ, ఎప్పుడైనా అవకాశం దొరికితే తప్పకుండా వినియోగించుకోమని చెప్పింది. అలాగే ఈ జలపాతాన్ని మొదటగా ఎవరు కనుగొన్నారు? లాంటి విశేషాలు కూడా చెప్తూ, జలపాతం తనకెప్పుడూ ఎంతో ఉత్సాహాన్నీ, ఉల్లాసాన్నీ కలిగిస్తుందనీ, దాన్నుంచి నేర్చుకోవలసినది ఎంతో ఉందని అనిపిస్తుందనీ అంటూ, అందరినీ ఆ సాయంకాలం వేళ వెలుగులో చూసి రమ్మని" చెప్పింది.

"మనం ఈ రోజు చాలా అదృష్టవంతులం, మన హోటల్ జలపాతానికి పక్కనే ఉంది.మీలో కొందరికి హోటల్ గదుల్లోంచి కనిపించవచ్చు కూడా, అందరూ ఓపిక చేసుకుని రాత్రి భోజనాలయ్యాకా ఫాల్స్ వైపుకు మాళ్ళీ నెమ్మదిగా నడిచి వెళ్ళమని, అప్పుడు ఫాల్స్ లైట్ల వెలుగులో మరింత అందంగా కనిపిస్తాయి" అనీ చెప్పింది.

"మనకిష్టమైన వారితో అలా కలిసి వెళ్ళడం ఎంతో రొమాంటిక్ గా ఉంటుంది" అంటూ నవ్వింది.

ఆమె చెప్పిన తీరుకు చిన్నగా నవ్వు వచ్చింది భరద్వాజకి. "ఆ వయసులో ప్రపంచమంతా ప్రేమ మయంగా కనిపించడం లో ఆశ్చర్యమేమీ లేదు " అనుకున్నాడు ఏలీ వైపు చూస్తూ. కొనగోటితో కంటి కొలకుల్లో నీటి బిందువు తుడుచుకుంటోంది ఆమె.

'ఏమయిందో? " అనుకున్నాడాయన

అందరూ దిగి హోటల్ రూముల్లోకి ప్రవేశించారు. ఉదయం న్యూయార్క్ లో బయలుదేరినప్పుడు చినుకులూ, మెరుపులతో మసకలేసిన ఆకాశం మబ్బు తెరతీస్తే, ప్రత్యక్ష్య నారాయణుడు చిరునవ్వులొలకబోస్తున్నాడు. నునువెచ్చని వేడి, విసురుగా వీస్తున్న గాలి కలిపి చలీ, వేడీ ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి. బస్ లో ఉన్న చైనీయులతో వారి భాషలో ఏదో మాట్లాడుతోంది ఏలీ. సాయంసంధ్య వెలుగులో ఆ జలపాతపు అందాలని ఆస్వాదిస్తూ నిలబడ్డాడు ఆయన.

"ఎంజాయింగ్? రైటర్ సార్!" అంటూ వచ్చింది ఏలీ.

" యా! ఎన్నాళ్ళుగానో చూడాలన్నది నా కోరిక, ఈ రోజు ఇలా మీ అందరివల్లా తీరింది, నీకు కూడా ఒక ఫోటో తీయనా?" అన్నాడు.

" ఓ యా, ష్యూర్ అని నవ్వుతూ నిలబడింది".

" నీ మెయిల్ కి పంపుతాను వెనక్కి వెళ్ళాకా" అన్నాడు.

" సరే" అంది నవ్వుతూ.

"ఎందుకో ఆమె పెదవుల మీద ఉన్న నవ్వు కళ్ళల్లో కనపడలేదు అతనికి, కారణమేమిటనేది అంతుపట్టలేదు, అడిగి తెలుసుకునేంత పరిచయం లేదు, తెలుసుకున్నా తనేమైనా చెయ్యగలిగే వీలు లేదు" అనుకున్నాడు.

" మీ మేడం రాలేదా? జంటగా వస్తే బాగుంటుంది కదా!" అంది తనే.

"లేదు, నేను పని మీద వచ్చాను కదా, ఈ సారి తీసుకుని వస్తాను సర్దాగా, మీ చిన్నపిల్లల్లా రొమాంటిక్ గా కాదనుకో" అన్నాడు నవ్వుతూ.

ఏలీ మాట్లాడలేదు. తల వంచుకుని చేతి గోళ్ళవైపు చూసుకోసాగింది.

"అరే ఏలీ! ఏమైంది? నేనేమైనా తప్పుగా మాట్లాడానా? నా ఉద్దేశ్యం" అని ఇంకా ఏదో చెప్పబోతుంటే

" లేదు, లేదు, మీరేమీ తప్పుగా అనలేదు, నేనే అనవసరపు జ్ఞాపకాల్లోంచి బయటపడలేకపోతున్నాను, అవి నా ఆశయాలకి అడ్డు వస్తాయని తెలిసినా సరే, ఎందుకో తెలుసా సార్? మనసు మన మాటే కాదు, మెదడు మాట కూడా వినదు కదా" అంది అభావంగా.

"ఏమయింది ఏలీ? ఈజ్ ఎవిరీథింగ్ ఒకే?" అసంకల్పితంగానే అనేశాడు.

"సారీ, చిన్నపిల్లవు కదా అని చనువుగా అడిగేశాను, మరోలా అనుకోకు, నీ పర్సనల్ విషయాలు అడగాలన్నది నా అభిమతం కాదు" అన్నాడు.

ఏలీ ఏమీ మాట్లాడలేదు కొన్ని క్షణాలు. ఆ తర్వాత "పరవాలేదు సార్, మీరు నాకు ఫాదర్ లాంటి వారు" అంది.

"ఫాదర్ కాదు,గ్రాండ్ ఫాదర్! ఇంచుమించు నీ వయసు మనవరాలుంది నాకు "అన్నాడాయన నవ్వుతూ. ఆ తర్వాత కాసేపు కబుర్లు చెప్పుకున్నారిద్దరూ.

"మీకు ఇండియన్ వెజిటేరియన్ భోజనం చూపిస్తాను" అని అక్కడే ఉన్న ఇండియన్ రెస్టారెంట్ కి తీసుకు వెళ్ళింది.

" ప్లేట్ లో ఉన్నది శాకాహారమైతే చాలు అనుకోండి, తినడానికి నాలుగు రకాలు దొరుకుతాయి" అంది నవ్వుతూ.

రాత్రి కొందరు మళ్ళీ ఫాల్స్ చూడడానికి వెళ్ళారు, అందరినీ పలకరించి వచ్చింది ఏలీ. " భోజనాలయ్యాయా?" అని ఆప్యాయంగా అడిగింది.

" మీరు రాత్రి వేళ చూడరా ఫాల్స్ ని?" భరద్వాజని అని అడిగింది.

" ఇప్పుడే వెళదామనుకుంటున్నాను" అన్నాడాయన. పక్కనే నడవసాగింది తను కూడా.

" జలపాతం హోరులోనే జీవిత నాదముంది కదూ! " అన్నాడాయన నెమ్మదిగా.

"అవును! నాకు కూడా అలాగే అనిపిస్తుంది, ఎప్పుడూ ఆగకుండా సాగే ప్రవాహం జలపాతం, ప్రయాణం జీవితం, కదా సార్" అంది.

"చాలా బాగా చెప్పావు, జీవితం ఎప్పుడూ ఒక చోట ఆగకూడదు, ఎన్ని అవాంతరాలు ఎదురైనా సరే, కదూ!" అన్నాడు

" నిజమే, అందుకే ఇలా ఎదురీదుతున్నాను అంది".

ఈ సారి "ఏమయింది?" అని అతను అడగలేదు.

ఆమే చెప్పడం మొదలు పెట్టింది.

" చైనాలో ఒక చిన్న పల్లెటూరు మాది. మా నాన్నా, అమ్మా, ఇద్దరు తమ్ముళ్ళూ, నేనూ ఇది మా కుటుంబం. 'యాంగ్ షు' అనే మా చిన్న ఊరిలో మాదో అందమైన ప్రపంచం. ప్రముఖ చిత్రకారుడు ఎంతమో ప్రేమగా గీసిన వర్ణ చిత్రంలా ఉంటుంది మా వూరు, కొండలూ, నదులూ అందించే సోయగాల మధ్య అప్పుడే విరిసిన పువ్వులా స్వచ్చంగా.

నాన్నా, అమ్మా చిన్న, చిన్న పనులు చేసేవారు. మేము ముగ్గురం ఆడుతూ, పాడుతూ చదువుకునేవాళ్ళం. మీకు తెలుసా? నాకప్పుడు ఇంగ్లీష్ కూడా రాదు, ఉత్త చైనీసే" అంది చిన్నగా నవ్వుతూ.

బదులుగా ఆయన కూడా నవ్వాడు

" మా ఊరిలో నాకన్నింటికంటే ఇష్టమైన ప్రదేశం మూన్ హిల్ అనే కొండ, సహజంగా ఏర్పడిన లైము స్టోన్ కొండ అది. ఎనిమిది వందల మెట్లు ఎక్కడానికి దాదాపు ఇరవై నిమిషాలు పడుతుంది, అది ఎక్కితే పైన చాలా బావుంటుంది,చుట్టుపక్కలున్న ఊర్లన్నీ కనిపిస్తాయి. నాకు బోర్ కొట్టినా, మనసు బాగోలేకపోయినా నేను ఆ మూన్ హిల్ ఎక్కేదాన్ని, అక్కడ కూర్చుని, కాసేపు ఆ పరిసరాలలో గడిపితే అన్నీ మరిచిపోయి మనసుకెంతో ఆహ్లాదం కలిగేది. అప్పుడప్పుడు నేనూ, తమ్ముళ్ళూ ఆడుకోవడానికి కూడా ఎక్కేవాళ్ళం.

అక్కడే పరిచయం అయ్యాడు చాంగ్. నాకంటే రెండు, మూడేళ్ళు పెద్ద వాడు. తన పరిచయంతోనే ఎక్కడుందో కూడా తెలియని అమెరికాని నాకు పరిచయం చేశాడు. మొదట్లో మామూలు విషయాలు మాట్లాడుకునేవాళ్ళం, అవి అప్పుడప్పుడు పెళ్ళి వరకు వెళ్ళినా కానీ మా

ఊరు దాటలేదు. ఒక రోజు చాంగ్ అమెరికా గురించీ, అక్కడ లభ్యమయ్యే అవకాశాల గురించీ తెలుసుకున్నానని, ఎలాగో ఒకలా అక్కడకి వెళ్ళగలిగితే మిగతా జీవితమంతా చాలా హాయిగా గడపవచ్చనీ చెప్పాడు.

నాకు మొదట నమ్మబుద్ధి కాలేదు. "ఇక్కడ హాయిగా ఉన్నాం కదా, ఎక్కడికో వెళ్ళడమెందుకు? " అని కూడా అనిపించింది. అప్పుడు చెప్పాడు చాంగ్, న్యూయార్క్ అనేది ఒక పెద్ద మహానగరం అనీ, అక్క దున్నన్ని అవకాశాలు మరెక్కడా ఉండవనీ, ఉద్యోగం చేస్తే అక్కడే చెయ్యాలనీ . అందులోని మాన్ హాటన్ ద్వీపంలో ఉన్న చైనా టవున్ లో తనకి చిన్నాన్న వరస అయ్యే ఒకతను ఉన్నారని, అతను సహాయం చేస్తాడు కనక మనం అమెరికా వెళ్ళిపోతే ఒక పక్కన ఉద్యోగం చేసుకుంటూ మరొక పక్క హాయిగా చదువుకొవచ్చునని నాకు నచ్చచెప్పడం మొదలు పెట్టాడు.

అతని మాటలకి ప్రభావితమైన నేను కూడా న్యూయార్క్ నగరాన్ని గురించీ, అక్కడున్న సంస్థలూ, పత్రికలూ, పేపర్ల గురించీ తెలుసుకోవడం మొదలుపెట్టాను. రాను, రానూ నాకు కూడా అదో పెద్ద కలల ప్రపంచంగా కనపడసాగింది. కానీ అక్కడకి వెళ్ళడానికి కావలసిన డబ్బు మా ఇద్దరి దగ్గరా లేదు. చట్ట వ్యతిరేకంగా వెళ్ళడం చాంగ్ కి పరవాలేకున్నా, నాకిష్టం లేదు. అది చాలా రిస్క్ అని నేను చాలా భయపడ్డాను, అది అతనికి పదే పదే చెప్పేదాన్ని.

అక్కడకి చాలామంది ఇల్లీగల్ గా వెళతారనీ, ఎవరూ పట్టించుకోరనీ అందువల్ల అలా వెళ్ళడమే సులభం, ఖర్చు లేని మార్గం అనీ అనేవాడు. కానీ నా అభిప్రాయం మాత్రం దానికి భిన్నంగా ఉండేది. నా పోరు పడలేక, తన చిన్నాన్న వరసయ్యే వ్యక్తి దగ్గర అప్పు తీసుకుని ఆ డబ్బుతో వీసా ఏర్పాటు చేస్తానని, ఆ అప్పుని ఇద్దరం సమానంగా కష్టపడి పని చేసి తీర్చాలని చెప్పగానే నేను సంతోషంగా ఒప్పుకున్నాను.

అప్పుడు మాముందున్నది మరొక సమస్య. "ఇంట్లో ఈ విషయం ఎలా చెప్పాలి?" అని. మా అమ్మా, నాన్నా ససేమీరా అన్నారు, "మెరిసేదంతా బంగారం కాదు, ఎక్కడుండే కష్టాలు అక్కడ ఉంటాయి, సొంత ఊరు కన్న తల్లీ ఒకటి" అన్నది వారి అభిప్రాయం. ఆ విషయం నేనూహించినదే, అయినా ఏం చెయ్యాలో? తెలియలేదు.

"అవన్నీ అర్థం లేని సెంటిమెంట్లు" అంటూ కొట్టి పారేశాడు చాన్. చాలా తర్జన భర్జన ల తర్వాత మొత్తానికి మా ఇంట్లో వారికి తెలియకుండా ఇద్దరం అమెరికా వచ్చి పడ్డాం. నేను ఇక్కడకి చేరిన రెండు రోజులకి మా ఇంటికి ఫోన్ చేసినప్పుడు అమ్మ ఏడుపు నా చెవుల్లో ఇప్పటికీ మోగుతూనే ఉంటుంది " అంటూ ఆగింది.

మాట్లాడకుండా వినసాగాడు భరద్వాజ.

కళ్ళల్లోని తడి పల్చటి ఆమె చెంపలని తడుముతోంది.

" పచ్చని ప్రకృతి ఒడిలో పెరిగిన నాకు ఈ కాంక్రీట్ జంగిల్ లో ఇమడటానికి చాలా కాలం పట్టింది. ఇదే మాన్ హాటన్ లో రెండు వీధుల అవతల ఉన్న వాతావరణానికీ, మేము దిగిన చోటుకీ ఉన్న తేడా నన్ను ఆశ్చర్య పరిచేది. మొదట సంపాదించే మార్గం ఉండాలి కనక ఇద్దరం చిన్న చిన్న ఉద్యోగాలలో చేరాము. నేను ఒక సూపర్ మార్కెట్ లో చేరితే, చాంగ్ ఒక బార్ కం హోటల్ లో వెయిటర్ గా.

చాంగ్ వాళ్ళ చిన్నాన్న ఇంట్లో ఒక గదిలో పార్టీషన్ కట్టిన దాంట్లో ఉండేవాళ్ళము. మిగతా ఇల్లంతా ఒక మాదిరిగా బావున్నా, మేముండే రూము మాత్రం పెచ్చులూడిపోయిన గోడలూ, పాతదైపోయిన పైకప్పూ, ఊడిపోయి పైకివచ్చిన వైర్లూ, ఇలా ఉండేది. ఆ పార్టీషన్ కి రెండు వైపులా స్లీపింగ్ బాగ్ లు వేసుకుని పడుకునేవాళ్ళం. ఆ ఇంటివారి అమ్మాయి కూడా నా పక్కనే పడుకునేది. అందరికీ కలిపి ఒకటే బాత్రూం. ఇంటావిడ రాత్రి రావడం ఆలస్యం అయితే వంట నేను చేసేదాన్ని.

రోజంతా సూపర్ మార్కెట్లో పని, చాంగ్ పని పదకొండు గంటలకి మొదలయ్యి, రాత్రి బార్ మూసేసేవరకూ సాగేది. దానితో మేమిద్దరం మాట్లాడుకోవడానికి కూడా వీలు కుదిరేది కాదు. కొన్నాళ్ళు పోయాకా చాంగ్ బాగా పొద్దుపోయి, అంటే ఇంచుమించు తెల్లవారు ఝామున రావడం మొదలు పెట్టాడు.

“ఆవేళప్పుడు పని చేసేదెవరా?' అని అనుకునేదాన్ని. అప్పటికే అక్కడ విన్న సంగతుల వల్ల నా మనసులో అనేకరకాలైన ఆలోచనలు, అనుమానాలు. ఒకటి, రెండుసార్లు అడగడానికి ప్రయత్నించినా, చాంగ్ మాట దాటేశాడు తప్ప సరి అయిన సమాధానం చెప్పలేదు.

ఒక ఆదివారం ఆ ఇంటి వారు పిల్లలని తీసుకుని బయటకు వెళ్ళారు. చాంగ్ రాత్రి పన్నెండు దాటుతుండగా వచ్చాడు. చాలా అలిసిపోయి కనిపిస్తున్నాడు.

" డిన్నర్ చేస్తావా?” అని అడిగాను.

" ఓపిక లేదు, వద్దు" అన్నాడు. కొంచం చికన్ నూడిల్ సూప్ బౌల్ లో వేసి ఇచ్చాను, మౌనంగా తినసాగాడు.

" ఈ మధ్యన నువ్వు చాలా అలిసిపోతున్నవ్ చాంగ్" అన్నాను.

" కష్టపడాలి కదా! లేకపోతే ఎలా?” అన్నాడు.

"కష్టపడుతున్నాం సరే! మన చదువు మాటేమిటి?” అన్నాను.

"చదువు సరే, అప్పు తీర్చద్దా? పైగా అద్దె ఒకటి” అన్నాడు.

" అందుకని ఓవర్ టైం గా పని చేస్తున్నవా? బార్లు కూడా రాత్రి మూసేస్తారు కదా! మరి పొద్దున్న వరకూ ఏం చేస్తున్నావు? ఇలా ఇన్నేసి గంటలు పని చేస్తే నీ ఆరోగ్యం ఏం అవుతుంది? “అన్నాను అనునయంగా.

ఎందుకో తెలీదు కానీ చాంగ్ కి చాలా కోపం వచ్చింది ఆ మాటలకి.

"నేనేమీ తాగి తందనాలాడటం లేదు, ఎవరితోనూ తిరగడం లేదు, ఎక్కువ పని చేస్తున్నాను అంతే" అన్నాడు కోపంగా.

" నేనలా అనలేదు చాంగ్, ఆ వేళప్పుడు పని చేసేది ఎవరు? అని అడిగాను, అదీ కాక నీ హెల్త్ “అని నేనింకా ఏదో చెప్పబోతుంటే

" నా ఇష్టం, నాకిష్టమైన పని చేస్తాను, నువ్వెవరు నన్నడగడానికి? నా భార్యవా? “అన్నాడు మరింత కోపంగా.

నా మనసులో ఉన్న అనుమానాలేవో నిజమవుతున్నాయని నాకప్పుడే అనిపించసాగింది. మరో నాలుగు రోజుల్లో తెలిసింది. రాత్రి బార్ మూసేసాకా జరిగే ఇల్లీగల్ గాంబ్లింగ్ డెన్ లో తన చిన్నాన్నతో పాటు చేరాడు. కొంతకాలం తర్వాత మనిద్దరమే దాన్ని కలిసి నడుపుకోవచ్చు అన్నాడుట ఆయన.

ఆవిషయం నాకు తెలిసిన రోజున మా మధ్య పెద్ద యుద్ధమే అయింది. నాకు అలాంటి పనులు సుతరామూ ఇష్టం లేదు, “పట్టుబడనంతవరకూ ప్రమాదం లేదు, అంతవరకూ రాదు” అంటాడు తను.

” ప్రమాదమని కాదు, అసలలాంటి పనులెందుకు చెయ్యాలి? చదువుకుని ఉద్యోగాలు చూసుకోవాలని వచ్చాము, ఇప్పుడీ పక్కదారులెందుకు?” అంటాను నేను.

మా పరిచయమయ్యాకా మొదటిసారి బాగా గట్టిగా ఒకరిమీద ఒకరు అరుచుకుని పోట్లాడుకున్నాము, ఎక్కడైతే మా ప్రయాణం మొదలు పెట్టామో, అదే చిన్న రూములో.

" అలా అయితే నీ దారి నీది, నా దారి నాది" అని నా ముఖానే తలుపు వేసి వెళ్ళిపోయాడు.” అంటూ ఆపింది, కొన్ని క్షణాల పాటు మాట్లాడలేదు ఏలీ.

"మరొక రెండు రోజుల్లో నన్ను ఇల్లు ఖాళీ చెయ్యమన్నారు వాళ్ళు. నా వైపు భాగానికి అద్దె నేనే ఇస్తానన్నా వినలేదు. చాంగ్ కి సహాయంగా ఉండే మరో అబ్బాయికి ఇల్లు ఇచ్చేశామని చెప్పారు. ఇల్లు లేక, ఎక్కడికెళ్ళాలో తెలియక ఒక రాత్రంతా ఇబ్బంది పడ్డాను, మా సూపర్ మార్కెట్ మెట్లమీద గడిపాను ఆ రాత్రి. మర్నాడు సూపర్ మార్కెట్ లో పని చేసే అమ్మాయి సహాయంతో ఆమె గదిలోకి తాత్కాలికంగా మారాను.

అప్పటినించీ, ఇప్పటివరకూ ప్రతీ క్షణమూ పోరాటమే. మానసికంగా నిలదొక్కుకోవడానికి కొంత కాలం పట్టింది. రక రకాల ఉద్యోగాలు చేశాను. అప్పులో నా వాటా నెల, నెలా చెల్లిస్తూనే ఉన్నాను, మాట తప్పడం నా నైజం కాదు.

ఇక్కడికి వచ్చాకా నేనూ, చాంగ్ కలిసి చూసిన మొదటిదీ, చివరిదీ నయగరా జలపాతం, అందుకే ఇది నాకు చాలా ప్రత్యేకం అంతే కాదు మీరు చెప్పినట్టు జలపాతం ఎప్పుడూ జీవితాన్ని స్ఫురింపచేస్తుంది. అలుపెరుగని ప్రయాణానికి సంకేతం. అందుకే ఇలాంటి టూర్ ఆపరేటర్ ఉద్యోగం అనగానే వెంటనే ఎగిరి గంతేసి ఒప్పుకున్నాను. మీరందరూ ఇచ్చే అలవెన్స్ మా జీతం. మొదట్లో వారమంతా చేసేదాన్ని, ఈ మధ్యనే కొద్దిగా డబ్బు వెసులు బాటు చిక్కి యూనివర్సిటీలో చేరాను డిగ్రీలో. అందుకని నాలుగురోజులు స్కూల్ కి వెళ్తాను. వారానికి రెండు రోజులు ఈ టూర్లకి వస్తాను, దాదాపు మూడు రోజులు పార్ట్ టైం పని చేస్తాను నేను ఇదివరకు పని చేసే సూపర్ మార్కెట్లోనే, ఇప్పుడు సీనియర్ ని కదా, డబ్బు కొంత ఎక్కువే ఇస్తారు. అంది నవ్వుతూ.

భరద్వాజ నవ్వలేదు. ఆమె ముఖంలో ఇందాకటి దైన్యం స్థానంలో విరుస్తున్న ఆత్మ విశ్వాసాన్ని చూస్తున్నాడు.

" మరి చాంగ్!, మళ్ళీ కలవలేదా?" అన్నాడు

" ఇప్పటివరకూ లేదు, ఇకపైన ఏమవుతుందో? తెలీదు. మంచికో, చెడుకో ఇక్కడికి వచ్చాము అనుకునేదాన్ని. ఇప్పుడు మంచికే అనుకుంటున్నాను, ఎందుకో తెలుసా సార్? పరిస్థితులు ఎదురు తిరిగితే కానీ, మన పోరాట పటిమ మనకి తెలీదు. హాయిగా బ్రతికే నన్ను ఈ మెస్ లోకి తీసుకువచ్చాడని చాంగ్ అంటే మొదట్లో నాకెంతో కోపంగా ఉండేది, కాని ఇప్పుడు లేదు. నాలోని వారియర్ ని నాకు పరిచయం చేసినందుకు అతనిపట్ల కృతజ్ఞతే ఉంది, దానితో పాటే అతనూ బావుండాలన్న తపన కూడా. నేను బాగా చదువుకుని న్యూయార్క్ లోనే మంచి ఉద్యోగం తెచ్చుంటాను తొందరలోనే, అది నా నమ్మకం, విశ్వాసం. అన్నీ చెప్పి మీకు బోర్ కొట్టించాను కదూ!" అంది.

"లేదు, కొండమీదనించి నేల జారే జలపాతమూ, నువ్వూ ఒకేలా కనిపిస్తున్నారు నాకు. అదే చురుకుతనం, ఎగిసిపడే విశ్వాసం. మంచు తుఫానులు తాత్కాలికంగా అవరోధాలు కలిగించినా, ఆపలేని వడి, సవ్వడి మీ ఇద్దరిలోనూ. నీకు నా శుభాశీస్సులు తల్లీ, ఐ విష్ యూ ఆల్ ది వెరీ బెస్ట్ " అన్నాడామె వైపు మురిపెంగా చూస్తూ.

వెనక పెద్ద సవ్వడితో నయాగరా జలపాతం నవ్వులు చిందించింది ఆయన మాటలకి.

●●●

Click here to share your comments on this story